సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



వాలీబాల్ పోటీలు ప్రారంభం


స్టీల్‌ప్లాంట్‌లోని ఇండోర్ స్టేడియంలో ఇంటర్ స్టీల్ వాలీబాల్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. IIలో



మత్స్య జాతుల మనోహరం

ఫిషింగ్ హార్బర్ వద్ద ఆధునీకరించిన మెరైన్ మ్యూజియంలో అత్యంత అరుదైన 250 మత్స్యజాతులు దర్శనమిస్తున్నాయి. IIలో

వీరగణపతిగా సంపత్ వినాయకుడు



సీతమ్మధార: చవితి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన మంగళవారం సంపత్ వినాయకుడు వీరగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

జీ-20 యూనివర్సిటీ కనెక్ట్‌లో ఏయూ విద్యార్థులు



సదస్సులో పాల్గొన్న ఏయూ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జీ-20 యూనివర్సిటీ కనెక్ట్ ఫినాలే కార్యక్రమంలో ఏయూ నుంచి 22 మంది విద్యార్థులతో కూడిన బృందం పాల్గొంది. ప్రగతి మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజు ఆధ్వర్యంలో వీరంతా భాగస్వాములయ్యారు. ఏయూ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం పట్ల నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తి రాక నేడు

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ బుధవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 6 గంటలకు తాడిపల్లి నుంచి రోడ్డు మార్గం ద్వారా విశాఖ బయలు దేరుతారు. మధ్యాహ్నం 12.10 గంటలకు విశాఖలోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 5 గంటలకు రుషికొండకు బయలుదేరి.. అక్కడ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. రాత్రి తిరిగి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని బస చేస్తారు. 28న ఉదయం 7 గంటలకు సింహాచలం వెళతారు. అక్కడ స్వామి దర్శనం అనంతరం తిరిగి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు విజయవాడ బయలుదేరుతారు.

అనంతుని జయంతి రేపు



పద్మనాభం: పద్మనాభం లోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈ నెల 28న అనంత పద్మనాభ స్వామి జయంతి జరగనుంది. ఇందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నాలుగు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలుపుతారు. ఐదు గంటలకు పంచామృతి అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూమి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను వేద పండితులు వేదిక వద్దకు తీసుకువస్తారు. ఉదయం 6.30 గంటలకు, ఉదయం 10 గంటలకు రెండు విడతల్లో వ్రతాలు జరుగుతాయి. గిరిపై వెలసిన అనంతుని ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తారు. ఇప్పటికే శ్రీదేవి, భూదేవి, అనంతునికి సమర్పించే నూతన వస్త్రాలను సిద్ధం చేశారు. గిరి మెట్లకు భక్తుల సహాయంతో సున్నం వేసి అందంగా తీర్చిదిద్దారు.

పీహెచ్‌సీ సేవలపై 'ఎన్‌క్యూఏఎస్' సంతృప్తి



మధురవాడ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న బృంద సభ్యులు

మధురవాడ: మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలపై ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు(ఎన్‌క్యూఏఎస్) బృంద ప్రతినిధులు డాక్టర్ నిర్మల్ జాయ్, డాక్టర్ సెంథిల్, డాక్టర్ అమూల్ ఇక్కడ రెండు రోజుల పాటు తనిఖీలు చేపట్టారు. పీహెచ్‌సీ పరిధిలో జనాభా, నమోదవుతున్న ఓపీ, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, ఫార్మసీ, టీబీ యూనిట్, ల్యాబ్ సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇక్కడ నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా క్వాలిటీ మేనేజర్ డాక్టర్ భాస్కర్, క్వాలిటీ కన్సల్టెంట్ తులసి, మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

మహారాణిపేట: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ బుధవారం ఉదయం 8.30 గంటలకు విశాఖ నుంచి అరకు బయలుదేరుతారు. అక్కడ ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి తిరిగి విశాఖ చేరుకుంటారు. 28న ఉదయం 8.30 గంటలకు అనంతగిరి, ఎస్.కోట, కొత్తవలస తదితర ప్రాంతాల్లో పర్యటనకు బయలుదేరుతారు. రాత్రికి తిరిగి విశాఖ చేరుకుంటారు. 29న స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. 30న ఉదయం 7.30 గంటలకు విశాఖ నుంచి బయలుదేరుతారు.

పర్యాటకాభివృద్ధి ప్రాప్తిరస్తు

కైలాసగిరి కొండ అంచు నుంచి సాగర కెరటాల హొయలను చూస్తూ నైట్ స్టే చేస్తే.. కొండపై నుంచి విశాఖ అందాలను చూస్తూ నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకుని ఆరగిస్తుంటే.. ఊహించుకోడానికే ఎంతో బాగుంది కదూ.. సముద్ర తీరాన భారీ నౌకలో ఆతిథ్యం.. కారవాన్‌లో విహారం.. విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేలా నేచ్యురల్ హిస్టరీ పార్కు.. సైన్స్ మ్యూజియం.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. పర్యాటకులను మంత్రముగ్ధులను చేసేలా వినూత్న, బృహత్తర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది రాష్ట్ర ప్రభుత్వం. దీనికి తోడు దిగ్గజ సంస్థలు విశాఖలో 7 స్టార్ హోటళ్లు, రిసార్టులు, కన్వెన్షన్ సెంటర్లు, షాపింగ్ మాల్స్ నిర్మాణాలకు పోటీ పడుతున్నాయి. విశాఖ కేంద్రంగా త్వరలోనే పాలన ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఆతిథ్య రంగం మరింతగా పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్‌లో విశాఖలో అలరించే సరికొత్త ప్రాజక్టుల వివరాలతో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

– దొండపర్తి

ఎటు చూసినా అందమే.. ఎటు చూసినా ఆనందమే.. చూసే కనులకు మనసుంటే.. ఆ మనసుకు కూడా కళ్లుంటే.. అని చెప్పిన సినీ కవి మాటలు.. అచ్చుగుద్దినట్లు ప్రకృతి రమణీయతతో ఓలలాడే విశాఖకు సరిపోతాయి. విశాఖను చూసేందుకు దేశ, విదేశాల పర్యాటకులు ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. ఒకవైపు విశాఖ అభివృద్ధితో పాటు మరో వైపు పర్యాటకంగా ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర ప్రాజెక్ట్‌లను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే కొన్ని కార్యరూపం దాల్చగా.. మరికొన్ని సమగ్ర నివేదిక దశలో.. ఇంకొన్ని ప్రణాళిక దశలో ఉన్నాయి. నగరం నుంచి భీమిలి వరకు సుదీర్ఘ తీర ప్రాంతం ఉండడంతో పలు బీచ్‌ల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. రుషికొండ బీచ్‌లో చేపట్టిన అభివృద్ధితో ప్రతిష్టాత్మక బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ లభించింది.

విశాఖపై దిగ్గజ సంస్థల ఆసక్తి

ఆతిథ్య రంగంలో విశాఖ ఇప్పటికే తనదైన ముద్ర వేస్తోంది. నగరంలో త్రీస్టార్ నుంచి ఫైవ్‌స్టార్ హోటళ్లు అనేకమున్నాయి. విశాఖ కేంద్రంగా పరిపాలన కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల తాకిడి పెరుగుతుంది. తద్వారా హోటళ్లు, రిసార్టుల వ్యాపారం రెట్టింపవుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. దీనికి తగ్గట్టుగానే విశాఖలో దిగ్గజ ఆతిథ్య రంగ సంస్థలు





కాపులుప్పాడలో ఏర్పాటు చేయనున్న హిస్టరీ పార్క్

ఒబెరాయ్, మేఫెయిర్ సంస్థలు 7 స్టార్ హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చాయి. ఒబెరాయ్ సంస్థ భీమిలి మండలం అన్నవరంలో 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.350 కోట్ల వ్యయంతో విల్లా రిసార్టుల నిర్మాణం చేపడుతోంది. ఈ రిసార్టు పనులకు ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. అలాగే భీమిలి మండలం అన్నవరంలోనే మేఫెయిర్ సంస్థ 40 ఎకరాల్లో రూ.525 కోట్లతో 7 స్టార్ హోటల్‌తో పాటు కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ముందుకొచ్చింది. వీటితో పాటు వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక మైస్ సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. భవిష్యత్‌లో విశాఖ ఆతిథ్య రంగానికి ఉన్న డిమాండ్‌కు ఈ సంస్థల రాకే నిదర్శనం.

వైద్య, ఆధ్యాత్మిక పర్యాటకంపై దృష్టి

విశాఖలో వైద్య, ఆధ్యాత్మిక పర్యాటకంపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సింహాచలం, కనకమహాలక్ష్మి దేవస్థానాలకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారు. ప్రసాదం స్కీమ్‌లో భాగంగా సింహాచలం ఆలయం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇక్కడ ప్రాచీన ఆలయాలను సర్క్యూట్‌గా చేసి స్పిరిచ్యువల్ టూరిజంను అభివృద్ధి చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాలన ప్రారంభమైతే నగరానికి పెద్ద ఎత్తున పర్యాటకులు పెరిగే అవకాశాలు ఉంటాయి. తద్వారా విమాన సర్వీసులు కూడా రెట్టింపవుతాయి. అంతర్జాతీయ విమానాల సంఖ్య పెరగడం ద్వారా మెడికల్, స్పిరిచ్యువల్ టూరిజంకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునేలా..



ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే విశాఖలో ఆతిథ్య రంగం పుంజుకుంది. ఒబెరాయ్, మేఫెయిర్ వంటి దిగ్గజ సంస్థలు విశాఖలో 7 స్టార్ లగ్జరీ హోటళ్లు నిర్మాణానికి ముందుకొచ్చాయి. వీటితో పాటు మెడికల్, స్పిరిచ్యువల్ టూరిజంపై కూడా దృష్టి పెడుతున్నాం. విశాఖలో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే తద్వారా పెట్టుబడులు, దాంతో ఉద్యోగావకాశాలు విపరీతంగా పెరుగుతాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఆ దిశగా పర్యాటక శాఖ అడుగులు వేస్తోంది.

– శ్రీనివాస్ పాని, రీజినల్ డైరెక్టర్, పర్యాటక శాఖ


ఆతిథ్య రంగానికి మహర్దశ



విశాఖలో పరిపాలన ప్రారంభమైతే ఆతిథ్య రంగానికి మహర్దశ పడుతుంది. ప్రముఖుల రాకతో హోటళ్లు, రిసార్టులు, రెస్టారెంట్ల వ్యాపారం బాగుంటుంది. తద్వారా అనేక సంస్థలు విశాఖలో హోటళ్లు, రిసార్టుల నిర్మాణానికి రూ.కోట్ల పెట్టుబడులతో ముందుకొస్తాయి. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పర్యాటక, ఆతిథ్య రంగం అభివృద్ధి చెందితే దాని ప్రభావంతో అన్ని రంగాలు కూడా పుంజుకుంటాయి.

– పవన్ కార్తీక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హోటల్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

వినూత్న ప్రాజెక్టులకు శ్రీకారం



విశాఖ పర్యాటక అందాలకు మరింత హంగులు అద్దేందుకు ప్రభుత్వం అనేక వినూత్న ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. కొన్ని ప్రాజెక్టుల కార్యాచరణ ఇప్పటికే ప్రారంభమవగా.. మరికొన్ని ప్రణాళికల దశలో ఉన్నాయి.

- జిల్లాలో మొదటిసారిగా కారవాన్ టూరిజం త్వరలోనే అందుబాటులోకి రానుంది. భీమిలి ఎర్రమట్టి దిబ్బలు, తొట్లకొండ ప్రాంతాల్లో కారవాన్ టూరిజంను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.
- కాపులుప్పాడ వద్ద టన్నెల్ అక్వేరియం, మినీ థీమ్ పార్క్ అభివృద్ధి..
- కైలాసగిరి వద్ద స్కై టవర్ (120 మీ), మినీ అమ్యూజ్‌మెంట్ పార్క్..
- తెన్నేటి పార్క్ వద్ద ఎంవీ మా నౌకను ఫ్లోటింగ్ రెస్టారెంట్‌గా అభివృద్ధి. నవంబర్‌లో పనులు ప్రారంభించేందుకు చర్యలు.
- భోగాపురం విమానాశ్రయంలో సుమారు 400 ఎకరాల్లో రూ.80 కోట్లతో ఢిల్లీ ఏరోసిటీ తరహాలో ఏరోపోలిస్ అభివృద్ధి..
- రూ.70 కోట్లతో సాగర్‌నగర్, తిమ్మాపురం, మంగమారిపేట, చేపలుప్పాడ, ఐఎన్ఎస్ కళింగ, ఎర్రమట్టి దిబ్బలు, భీమునిపట్నం, నాగయంపాలెం, అన్నవరం, కాంచెరుపాలెం ప్రాంతాల్లో బీచ్‌ల అభివృద్ధి..

పర్యాటకంలో విశాఖకు అవార్డుల పంట

దొండపర్తి: పర్యాటకంలో విశాఖకు అవార్డుల పంట పండింది. రాష్ట్ర వార్షిక టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డులను వివిధ కేటగిరీల కింద విశాఖలో ఉన్న హోటళ్లు, రిసార్టులు, రెస్టారెంట్లు, ట్రావెల్ సంస్థలు సొంతం చేసుకున్నాయి. బెస్ట్ 5 స్టార్ హోటల్‌గా రాడిసన్ బ్లూ అవార్డును దక్కించుకుంది. అలాగే 4 స్టార్ విభాగంలో హోటల్ దసపల్లా, బెస్ట్ బడ్జెట్ హోటల్‌గా ఎలిగంట్ హోటల్, బెస్ట్ హరితా హోటల్‌గా అరకు హరిత వ్యాలీ రిసార్ట్, బెస్ట్ హోటల్ బెస్ట్ మీటింగ్ వెన్యూగా వరుణ్‌బీచ్ నోవోటెల్, బెస్ట్ రెస్టారెంట్ ఇన్ హోటల్‌గా గ్రీన్‌పార్క్‌లో మెకాంగ్ రెస్టారెంట్, బెస్ట్ స్టాండ్-అలోన్ రెస్టారెంట్‌గా టైకూన్ అండ్ హెరిటేజ్ రెస్టారెంట్, బెస్ట్ స్టాండ్ అలోన్ కన్వెన్షన్ సెంటర్‌గా వైజాగ్ కన్వెన్షన్స్ అవార్డును సొంతం చేసుకున్నాయి. అలాగే బెస్ట్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్(డొమెస్టిక్)గా ట్రావెల్ హోం, బెస్ట్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్‌గా ట్రావెల్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్, మోస్ట్ ఇన్నోవేటివ్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్‌గా హాలిడే వరల్డ్, బెస్ట్ టూరిజం ప్రమోషన్ కొల్లాటిరల్ పబ్లిసిటీ మెటీరియల్‌గా విశాఖపట్నం పాకెట్ టూరిస్ట్ గైడ్, మోస్ట్ ఇన్నోవేటివ్ యూజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/బెస్ట్ టూరిజం వెబ్‌సైట్‌గా యో వైజాగ్‌కు అవార్డులు లభించాయి.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం
- రైతులిచ్చిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం



వెబెక్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి వెబెక్స్ ద్వారా కాంట్రాక్టర్లు, ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, జెడ్పీలు, ఎంపీడీవోలు, వీఎంఆర్డీఏ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగనన్న లే అవుట్లలో సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పని ప్రారంభించిన ఇళ్ల యజమానుల పేరిట బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేసి.. ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల స్టేజీ అప్‌డేట్ చేయాలని, ఇసుక, స్టీల్, సిమెంట్‌ను లేఅవుట్లకు ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని ఆదేశించారు. ఐరిష్ అప్‌డేట్ కావడం లేదని క్షేత్రస్థాయి ఇంజినీర్లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. సమస్యను తక్షణం పరిష్కరించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, ముఖ ద్వారాల నిర్మాణం, కూలీల సమస్య తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. జీవీఎంసీలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఆనందపురం, పద్మనాభం మండలాల్లో జగనన్న కాలనీల నిర్మాణాలకు రైతులిచ్చిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దన్నారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఉక్కు సహాయ మంత్రి పర్యటన రద్దు

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే స్టీల్‌ప్లాంట్ పర్యటన రద్దయింది. షెడ్యూల్ ప్రకారం ఆయన మంగళవారం విజయవాడ నుంచి సాయంత్రం 4.30 గంటలకు స్టీల్‌ప్లాంట్ రావాల్సి ఉంది. కేంద్ర మంత్రి పర్యటనను అడ్డుకునేందుకు ఉక్కు పోరాట కమిటీ సిద్ధమైంది. నాయకులు ఆయా కార్మిక సంఘాల కార్యకర్తలను పెద్ద ఎత్తున హిల్ టాప్ కూడలికి రావాలని పిలుపు నిచ్చారు. ఇటీవల కేంద్ర ఉక్కు కార్యదర్శి నరేంద్రనాథ్ సిన్హా స్టీల్‌ప్లాంట్ పర్యటనలో జరిగిన రగడ నేపథ్యంలో పోలీసు అధికారులు, ఉక్కు యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చించారు. ఎట్టకేలకు కేంద్ర పర్యటన రద్దయినట్టు యాజమాన్య వర్గాలు ప్రకటించాయి. దీంతో కార్మికులు హిల్‌టాప్ కూడలి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, డి.వి.రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం

సీపీ రవిశంకర్



దిశ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

పీఎంపాలెం: ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలబడి.. వారి రక్షణకు పూర్తిస్థాయి సేవలందించాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అధికారులను ఆదేశించారు. ఎండాడ వద్ద గల దిశ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చే మహిళలు, వారి వెంట తీసుకొచ్చే పిల్లలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. మహిళలకు చైతన్యం కల్పించేందుకు స్టేషన్‌లో ప్రదర్శించిన చిత్రాలు, సైబర్ క్రైం విభాగం, కంప్యూటర్ గదులను ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, వాటి పరిష్కారంపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. సీపీ వెంట డీసీపీ శ్రీనివాస్, ఏడీసీపీ నాగేంద్రుడు, దిశ స్టేషన్ ఏసీపీ వివేకానంద, నార్త్ ఏసీపీ శివరామిరెడ్డి, పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సీజ్ చేసిన వాహనాల యార్డ్ తనిఖీ

మధురవాడ: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు ఉంచే శివశక్తినగర్‌లోని యార్డును పరిశుభ్రంగా ఉంచాలని సీపీ రవిశంకర్ ఆదేశించారు. ఈ యార్డును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులో పెరిగిన తుప్పలను వెంటనే తొలగించాలన్నారు. ఇక్కడ సీజ్ చేసిన ప్రాపర్టీ ఎంత ఉంది. యార్డు విస్తీర్ణం ఎంత? రక్షణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బక్కన్నపాలెం బాబా కాలేజీ సమీపంలోని పోలీస్ శాఖకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. డీసీపీ-1 శ్రీనివాస్, పశ్చిమ ఏసీపీ శివరామరెడ్డి, పీఎంపాలెం సీఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నాలుగో పారిశ్రామిక విప్లవానికి ఏపీ రెడీ

- ఏయూలో ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ ల్యాబ్
- కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- నూతన సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించే అవకాశం
- ఇంజినీరింగ్ కోర్సుల్లో ఇప్పటికే ఇండస్ట్రీ 4.0ను సబ్జెక్టుగా చేర్చిన ఏయూ



పుణెలోని ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఏయూ అధికారులు

ఏయూ క్యాంపస్: నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమైంది. ఇందులో భాగంగానే ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ ల్యాబొరేటరీ ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో ఏర్పాటు కాబోతోంది. ఇప్పటికే ఇండస్ట్రీ 4.0ను ఒక సబ్జెక్టుగా ఏయూలో ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భారత భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏయూలో ఇండస్ట్రీ 4.0 ల్యాబొరేటరీ ఏర్పాటు చేయబోతున్నారు. ఇటీవల ఏయూను సందర్శించిన భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు ఇక్కడి మౌలిక వసతులు, విద్యార్థులకు ఉపయుక్తంగా ఏర్పాటైన నూతన పరిశోధన, స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను పరిశీలించారు. కాగా, దీనిని మరింత బలోపేతం చేసేలా ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ ప్రోటోటైప్ ల్యాబొరేటరీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది.

దేశంలోనే రెండో ల్యాబ్

భారత భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో పుణేలో ఇప్పటికే సెంటర్ ఫర్ ఇండస్ట్రీ 4.0 (సీ4ఐ4) ల్యాబ్ ఏర్పాటైంది. ఇదే తరహాలో ఏయూలో రూ.4 కోట్ల వ్యయంతో ల్యాబ్ ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందాన్ని ఇటీవల చేసుకున్నారు. ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ పుణేలోని సీ4ఐ4 ల్యాబ్‌ను సందర్శించి సమర్థ్ ఉద్యోగ్ ఫోరంతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు.

పరిశ్రమ స్వరూపం మారిపోతోంది

ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికల ఫలితంగా పరిశ్రమల పనితీరు, స్వరూపాలు పూర్తిగా మారిపోతున్నాయి. దీనిలో భాగంగా లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, సప్లయ్ ఆటోమేషన్ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న షాప్ ఫ్లోర్ పనులు ఇకపై టాప్ ఫ్లోర్ నుంచి జరుగుతాయి. వీడియో కెమెరాలో పరిశీలిస్తూ ఏఐ, రోబోటిక్స్ సాయంతో డిజిటలైజేషన్ ప్రాసెస్‌తో పనిచేయడం త్వరలో సాధ్యపడుతుంది. ప్రస్తుతం ఉన్న వస్తు ఉత్పత్తి స్థానంలో ప్రతి వ్యక్తికి వ్యక్తిగతంగా అవసరమైన ఉత్పత్తులు రాబోతున్నాయి. ఇప్పటికే జర్మనీలో ఇండస్ట్రీ 4.0 అమలవుతోంది. త్వరలో ప్రపంచం మొత్తం ఈ టెక్నాలజీని వినియోగించబోతోంది. ఇప్పటినుంచి విద్యార్థులను నూతన సాంకేతికతకు సన్నద్ధం చేస్తూ, వారికి విస్తృత అవగాహన కల్పించే విధంగా ఈ ల్యాబ్ పనిచేస్తుంది.

ఫ్యూచర్ టెక్నాలజీ పరిచయం

ఏయూలో ఏర్పాటయ్యే ఇండస్ట్రీ 4.0 సెంటర్‌లో ఫ్యూచర్ టెక్నాలజీ యంత్రాలు, ఉపకరణాలు ఏర్పాటు అవుతాయి. రోబోటిక్, ఏఐ, ఎంఐతో పని చేయడం, డేటా సైన్స్, సేల్స్ ఫోర్స్ ఆటోమేషన్, లైవ్ స్ట్రీమింగ్, మాన్యుఫాక్చరింగ్ డిజిటలైజేషన్ ప్రాసెస్ వంటి వాటిపై అవగాహన కల్పించేలా దీనిని ఏర్పాటు చేస్తారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతను తయారు చేయాలనే ఉద్దేశంతో ఏయూ ఇప్పటికే ఇండస్ట్రీ 4.0ను ఒక సబ్జెక్టుగా ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధిస్తోంది. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలోనే దీనిని పరిచయం చేస్తూ దాదాపు మూడేళ్లు దీనిని చదివే అవకాశం కల్పించారు. తద్వారా భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పనిచేసే సామర్థ్యాలను విద్యార్థులు పెంపొందించుకుంటారు.

సీఎం కోరిక మేరకు..



మారుతున్న ప్రతి టెక్నాలజీని రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి పరిచయం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారు. దీనిలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసే ఇండస్ట్రీ 4.0 ల్యాబొరేటరీని ఏయూతోపాటు అనుబంధ కళాశాలల విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు సందర్శించి, అవగాహన పొందే విధంగా అవకాశం కల్పిస్తాం. భవిష్యత్ టెక్నాలజీలపై ఇప్పటి నుంచే అవగాహన అందించడం సాధ్యపడుతుంది.

– పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఉపకులపతి

ఎస్పీ సంతకం ఫోర్జరీ

- తప్పుడు ధ్రువపత్రాలతో విధుల్లో చేరిన కార్మికులు
- బయటపడిన జార్ఖండ్, బిహార్ కార్మికుల మోసం
- విశాఖ వచ్చిన జార్ఖండ్ పోలీసులు
- కాంట్రాక్టర్‌ను విచారించిన వైనం

మల్కాపురం : వారంతా బిహార్, జార్ఖండ్‌కు చెందిన కార్మికులు..ఉపాధి కోసం ఏకంగా ఎస్పీ సంతకాన్నే ఫోర్జరీ చేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విషయం బయటకు పొక్కడంతో కార్మికులు గుట్టు చప్పుడు కాకుండా సొంత రాష్ట్రాలకు వెళ్లిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖలోని డాక్‌యార్డు సమీపన ఎస్‌బీసీ (షిప్ బిల్డింగ్ సెంటర్)లో పనిచేసేందుకు బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 12 మంది కార్మికులు వచ్చారు. ఇక్కడ పనుల్లో చేరాలంటే వారి బయోడేటాతో పాటు వారుంటున్న జిల్లా ఎస్పీల నుంచి వెరిఫికేషన్ (నేర చరిత్ర లేదు అని ఇచ్చే సర్టిఫికెట్) పత్రాన్ని కూడా జతచేయాలి. అయితే ఈ 12 మంది అక్కడ ఎస్పీ సంతకాన్ని ఫోర్జరీ చేసి బయోడేటాకు ఈ వెరిఫికేషన్ సర్టిఫికెట్ సమర్పించారు. ఇవన్నీ సక్రమంగా ఉన్నాయని భావించి సదరు కాంట్రాక్టర్ వీరిని పనిలో పెట్టుకున్నాడు. అలాగే ఎస్‌బీసీ సెక్యూరిటీ అధికారులు కూడా గేటు పాస్ ఇచ్చారు. గత ఏడాది నుంచి వీరంతా పనిచేస్తున్నారు. వీరిపై ఎస్‌బీసీ నేవల్ అధికారులకు ఎందుకో అనుమానం వచ్చింది. పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆ రాష్ట్రాలకు చెందిన పోలీసులకు వీరి సర్టిఫికెట్లు పంపారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. జార్ఖండ్ ఎస్పీ సంతకం ఫోర్జరీ చేసినట్టు బయటపడింది. ఈ విషయం ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఎలా తెలిసిందో కానీ వారంతా సోమవారం జార్ఖండ్, బిహార్ రాష్ట్రాలకు వెళ్లిపోయారు. మంగళవారం మధ్యాహ్నం జార్ఖండ్ నుంచి పోలీసులు మల్కాపురం స్టేషన్‌కు వచ్చి ఎస్పీ సంతకం చేసి కార్మికుల వివరాలు తెలుసుకున్నారు. వీరిని పనుల్లో పెట్టుకున్న కాంట్రాక్టర్‌ను విచారించారు.

నేడు ఏయూలో ఇంటర్న్‌షిప్ డ్రైవ్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం ఇంటర్న్‌షిప్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. మ్యాక్స్ రిటైల్ డివిజన్-లైఫ్‌స్టైల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 40 మంది ఇంటర్న్‌షిప్ ట్రైనీల కోసం డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఏదైనా డిగ్రీ చదువుతున్న వారు, బీబీఏ, ఎంబీఏ చదువుతున్న వారు అర్హులు. ఆసక్తి, అర్హత కలిగిన వారు https://www.ncs.gov.in/ లో పేర్లు నమోదు చేసుకుని.. ఉదయం 10.30 గంటలకు ఏయూ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో కార్యాలయంలో జరిగే డ్రైవ్‌కు హాజరుకావచ్చు. ఎంపికైన విద్యార్థులకు స్టైఫండ్‌తో పాటు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ అందజేస్తారు. పూర్తి వివరాలకు 90322 27630, 96660 92491ను సంప్రదించవచ్చు.

ఆర్టీసీ బస్సు ఢీకొని భర్త మృతి

భార్యకు స్వల్ప గాయాలు



ఘటనా స్థలంలోనే మృతి చెందిన రామకృష్ణ

గోపాలపట్నం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో భర్త ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యాడు. ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా జామికి చెందిన సీహెచ్ రామకృష్ణ(40) స్థానికంగా కలాసీ పనిచేస్తూ.. కుటుంబంతో బర్మా క్యాంప్ శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్నాడు. భార్య కృష్ణవేణితో కలసి బైక్‌పై మంగళవారం మధ్యాహ్నం బర్మాక్యాంప్ నుంచి గాజువాక బయలుదేరాడు. ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్దకు వచ్చే సరికి విశాఖ నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. రామకృష్ణ బస్సు వెనుక చక్రాల కింద పడడంతో హెల్మెట్ ఉన్నా.. తలకు బలమైన గాయాలయ్యాయి. మెదడు సైతం బయటకు వచ్చేసింది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. కృష్ణవేణి స్వల్ప గాయాలతో బయటపడింది. ఆమెను 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న సీఐ మళ్ల అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎస్‌ఐ మోహనరావు దర్యాప్తు చేస్తున్నారు.

కోరి ఆర్గానిక్స్ పరిశ్రమలో ప్రమాదం : కార్మికుడి మృతి



రాజారావు (ఫైల్)

పరవాడ : జేఎన్ ఫార్మాసిటీలో కోరి ఆర్గానిక్స్ పరిశ్రమలో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో అనకాపల్లి జిల్లా చోడవరం మండలం కన్నమ్మపాలెం గ్రామానికి చెందిన కింతాడ రాజారావు (37) అనే కార్మికుడు మృతి చెందాడని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు. రాజారావు పదేళ్ల నుంచి కోరి ఆర్గానిక్స్ పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం విధులకు వచ్చిన రాజారావు మధ్యాహ్నం 12.30 సమయంలో కొత్త బ్యాచ్ వేయడానికి రియాక్టర్‌ను శుభ్రం చేసేందుకు రోప్ సాయంతో లోపలికి దిగాడు. రియాక్టర్‌ను శుభ్రం చేసిన అనంతరం బయటకు వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి రియాక్టర్ లోపల అమర్చిన బ్లేడులపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న తోటి కార్మికులు రాజారావును నగరంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజారావు మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నగరంలోని కేజీహెచ్‌కు తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు. ఘటన స్థలాన్ని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఎస్‌ఐ మల్లేశ్వరరావు సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కోరి ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు

సైబర్ పోలీసులకు వైఎస్సార్ సీపీ ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బోని శివరామకృష్ణ, బొండా ఉమామహేశ్వరావు, పీలా ప్రేమ్ కిరణ్

సాక్షి, విశాఖపట్నం: మహిళలను అగౌరవపరిచేలా 'వైటీపీ రెబల్' అకౌంట్ పేరిట సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న చిల్లా రఘునాథ్‌రెడ్డిపై వైఎస్సార్ సీపీ మంగళవారం సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పార్టీ ఐటీ వింగ్ అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్ కిరణ్ సీఐ భవానీప్రసాద్‌కు ఫిర్యాదు చేసి, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి పాల్గొన్నారు.

28న రైల్వే సహాయ మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర రైల్వే శాఖ, టెక్స్‌టైల్స్ సహాయ మంత్రి దర్శన జర్దోష్ ఈ నెల 28న విశాఖ వస్తున్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు విమానంలో సూరత్ నుంచి హైదరాబాద్ మీదుగా విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి నోవాటెల్‌లో బస చేస్తారు. 29న ఉదయం 9 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి బ్రాండెక్స్ టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ఏటికొప్పాక చేరుకుని బొమ్మలను పరిశీలిస్తారు. రాత్రికి నోవాటెల్‌కు చేరుకుని బస చేస్తారు. 30న ఉదయం 10 గంటలకు విశాఖ రైల్వేస్టేషన్‌లో స్టేషన్ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారు. 11 గంటలకు కోచ్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాపును సందర్శించి.. తిరిగి నోవాటెల్‌కు చేరుకుంటారు. అక్టోబర్ ఒకటో తేదీన బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అక్టోబర్ 2న ఉదయం పది గంటలకు విమానంలో బెంగళూరు బయలుదేరుతారు.

మత్స్య జాతుల మనోహారం

- 250 రకాలతో అలరారుతున్న మెరైన్ మ్యూజియం
- జనం ఎరుగని సముద్ర జాతులకు ఆలవాలం
- వాటిని పదిల పరిచే బాధ్యతను తీసుకున్న ఎఫ్ఎస్ఐ
- భావితరాలు, విద్యార్థులు, పరిశోధకులకు ఉపయుక్తం

సాక్షి, విశాఖపట్నం: ఆవులను చూశాం. గుర్రాలనూ చూశాం.. పాములనూ చూస్తున్నాం. కానీ సముద్రపు ఆవు.. సముద్రపు గుర్రం, సముద్ర పాములను ఎప్పుడైనా చూశారా? అయితే వాటి కోసం మీరు సముద్రంలోకి వెళ్లక్కర్లేదు. మన విశాఖ బీచ్ రోడ్డులో ఇలాంటి వాటిని చూడొచ్చు. ఫిషింగ్ హార్బర్ వద్ద ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) భవనంలో ఆధునీకరించిన మెరైన్ మ్యూజియంలో వీటితోపాటు జనం కంటపడని అత్యంత అరుదైన 250 మత్స్యజాతులు దర్శనమిస్తున్నాయి. అక్కడ గతంలో ఏర్పాటు చేసిన మెరైన్ మ్యూజియంను ఇటీవల ఆధునీకరించారు. ఈ మ్యూజియంను భావి తరాలు, విద్యార్థులు, పరిశోధకులతో పాటు సాధారణ ప్రజలు సందర్శించడానికి అనుమతించనున్నారు. ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్తలు పరిశోధనల్లో భాగంగా తమ నౌకల్లో సముద్రంలోకి వెళ్లినప్పుడు అరుదైన మత్స్య జాతులను తీసుకొస్తారు. వాటిలో ముఖ్యమైన వాటిని ఫార్మాలిన్, నీరు (1:4 నిష్పత్తి) కలిగిన మిశ్రమంలో గాజు సీసాల్లో భద్రపరుస్తారు. మరికొన్నింటిని లోపలున్న మాంసాన్ని తొలగించి దూదిని ఉంచి, పైన రసాయనంతో కూడిన పాలిష్‌ను పూస్తారు. ఇలాంటి వాటిని ఈ మెరైన్ మ్యూజియంలో ఉంచారు. వాటిలో కొన్ని అరుదైన మత్స్యజాతుల గురించి తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. వాటి తీరుతెన్నులను పరికిస్తే వింత గొలుపుతుంది! వాటిలో కొన్ని..



సముద్రపు ఆవు (సీ కౌ)

ఇవి తమిళనాడులోని గల్ఫ్ ఆఫ్ మన్నార్, గుజరాత్‌లోని గల్ఫ్ ఆఫ్ కచ్, అండమాన్ నికోబార్ దీవుల సముద్ర జలాల్లోనే ఉన్నాయి. ఇవి శాకాహారులు. సముద్రపు గడ్డిని, ఆల్గేను తింటాయి. క్షీరద జాతికి చెందిన ఇవి 2-7 ఏడేళ్లకోసారి సంతానోత్పత్తి చేస్తాయి. 2.5 మీటర్ల పొడవు, 230 నుంచి 400 కిలోల వరకు బరువు పెరుగుతాయి. వీటి జీవితకాలం 70 ఏళ్లు. ఇలాంటి భారత సముద్ర జలాల్లో 200 వరకు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం విశాఖ మెరైన్ మ్యూజియంలో ఉన్న ఈ సీ కౌ తమిళనాడులోని ట్యుటికోరిన్ మ్యూజియంలో ఉండేది. ఆ మ్యూజియాన్ని మూసివేయడంతో దానిని 1985లో అక్కడ నుంచి ఇక్కడకు తెచ్చారు.

సముద్రపు గుర్రం (సీ హార్స్)

సీ హార్స్. దీనినే సముద్రపు గుర్రంగా పిలుస్తారు. చూడటానికి గుర్రపు ఆకారంలో ఉంటూ సముద్రంలోనే జీవిస్తుంది. రొయ్య సైజులో ఉంటుంది. వీటిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. ఇవి తూర్పు తీరంలోను, అండమాన్ సముద్రంలోనూ ఉంటాయి. వీటికంటే ఆస్ట్రేలియా సముద్ర జలాల్లో పెరిగేవి ఇంకా తెలుపు రంగులో ఉంటాయి. వీటిని అంతరించిపోతున్న జాతుల్లో ఒకటిగా గుర్తించారు.



సముద్రపు పాము (సీ స్నేక్)



సీ స్నేక్‌లు తూర్పు, పశ్చిమ తీరాల్లోనూ ఉనికిలో ఉన్నాయి. ఇవి సముద్రం అడుగున 40-60 మీటర్ల లోతులో ఉంటాయి. మామూలు సర్పాలకంటే పది రెట్ల అధిక విషాన్ని కలిగి ఉంటాయి. ఇవి మనుషుల్ని కాటేస్తే బతికి బట్టకట్టడం అసాధ్యం. రెండు మీటర్ల పొడవుంటాయి. ప్రస్తుతం ఈ మ్యూజియంలో ఉంచిన ఈ సీ స్నేక్ భీమిలి తీరంలో 2018లో ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్తలకు పట్టుబడింది.

సీ యాపిల్

ఇవి చూడటానికి యాపిల్ పండ్లను పోలి ఉంటాయి. అందుకే వీటిని సీ యాపిల్‌గా పిలుస్తారు. వీటి ఉనికి కళింగపట్నం, ఒడిశా తీరంలోని సముద్రంలో రాత్రి ప్రదేశాల్లో సంచరిస్తాయి.. వీటిలో ఔషధ గుణాలుండడం వల్ల డిమాండ్ అధికం.



కింగ్ క్రాబ్



కింగ్ క్రాబ్.. పీత జాతికి చెందిన ఇవి పీత ఆకారంలోనే భిన్నంగా ఉంటాయి. వీటి ప్రత్యేకత ఏమిటంటే.. నాలుగు వేల సంవత్సరాలుగా ఇవి రూపురేఖలు మార్చుకోకుండా జీవిస్తున్నాయి. వీటి రక్తం నీలం రంగులో ఉంటుంది. ఈ రక్తాన్ని ఔషధాల్లో వినియోగిస్తుంటారు. ఈ కింగ్ క్రాబ్ ఒడిశా, పశ్చిమబెంగాల్ సముద్ర జల్లాలో అరుదుగా కనిపిస్తుంటాయి. ఈ మ్యూజియంలో ఉంచిన కింగ్ క్రాబ్ ఒడిశాలోని పారాదీప్ తీరంలో ఎఫ్ఎస్ఐ వెసల్ శాస్త్రవేత్తలకు చిక్కింది.

త్వరలో సందర్శకులకు అనుమతి



సికిల్ ఫిష్

ఈ మెరైన్ మ్యూజియంలోకి త్వరలో సందర్శకులను అనుమతించనున్నారు. విద్యార్థులు, స్కాలర్లతో పాటు సాధారణ ప్రజానీకానికి ముందస్తు అనుమతితో ప్రవేశానికి వీలు కల్పిస్తారు. అరుదైన, అంతరించి పోతున్న సముద్ర జాతుల విశిష్టతను తెలుసుకునేందుకు ఈ మ్యూజియం దోహదపడుతుందని ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్త గుమ్మడి వెంకట అంకినీడు ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.

కేకే లైన్‌లో శరవేగంగా పునరుద్ధరణ పనులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ మంగళవారం వాల్తేర్ డివిజన్ పరిధి లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ముందుగా కేకే లైన్‌లో ఇటీవల కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు 20 కంటే ఎక్కువ అధిక సామర్థ్యం గల ఎర్త్ మూవర్స్, ప్రొక్లెయినర్స్, ఇతర మెషినరీని వినియోగిస్తూ 400 మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని అధికారులు ఆయనకు తెలిపారు. ట్రాక్‌లపై సుమారు 10వేల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చి చేరిందని, ఇప్పటికే సుమారు 8వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించినట్లు చెప్పారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నా పను లు కొనసాగిస్తున్నట్లు డీఆర్ఎం వివరించారు. సంఘటన స్థలంలోనే ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్‌లకు చెందిన వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధికారులతో జీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విశాఖలోని ఆశీర్వాద్ కల్యాణమండపంలో జరుగుతున్న ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ వార్షిక జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్‌ను సందర్శించారు.

కేకే లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు: కేకే లైన్‌లో రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన కొండచరియలను తొలగిస్తున్న నేపథ్యంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు బుధవారం కూడా గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. రూర్కెలా-జగదల్‌పూర్(18107) ఎక్స్‌ప్రెస్ మంగళవారం కోరాపుట్ వరకు నడిచింది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్ బుధవారం కోరాపుట్ నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది. భువనేశ్వర్-జగదల్‌పూర్(18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం కోరాపుట్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్(18448) ఎక్స్‌ప్రెస్ బుధవారం కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం కోరాపుట్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ బుధవారం కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ బుధవారం అరకు వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ బుధవారం అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. హౌరా-జగదల్‌పూర్(18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ మంగళవారం టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ బుధవారం టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

ఇంటర్ స్టీల్ వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న స్టీల్ డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఇంటర్ స్టీల్ వాలీబాల్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్టీల్ ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డు (ఎస్‌సీఎస్‌బీ) ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉక్కు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నాలుగు రోజుల పోటీలను స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి.పాండే, ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. డైరెక్టర్ పాండే తన ప్రసంగంలో క్రీడల ప్రాముఖ్యత, వివిధ నైపుణ్య పెంపుదల, క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్, టాటా స్టీల్, జిందాల్ స్టీల్, రూర్కెలా స్టీల్, బొకారో స్టీల్, భిలాయ్ స్టీల్, ఇస్కో బర్నపూర్, దుర్గాపూర్, అల్లాయ్ స్టీల్, సేలం తదితర 10 స్టీల్‌ప్లాంట్లకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్ జట్టు 25-13, 25-14 స్కోర్‌తో వరుస సెట్లలో రూర్కెలా స్టీల్‌ప్లాంట్ జట్టుపై గెలుపొందింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీ, యు.శ్రీధర్, స్పోర్ట్స్ విభాగాధిపతి అమిత్ ఘుడాయ్, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

నేడు వివిధ పోటీల్లో క్రీడాకారుల ఎంపిక

అగనంపూడి: విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నీకాయిట్, బాల్ బాడ్మింటన్ అండర్ 14, 17 (బాలురు, బాలికల) విభాగాల్లో పోటీలు, ఎంపికలు బుధవారం నిర్వహించనున్నట్టు విశాఖ, అనకాపల్లి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, ఎంపీ నాగేశ్వరరావు తెలిపారు. టెన్నీకాయిట్ పోటీలు, ఎంపికలు పరవాడ మండలం 'పెదముషిడివాడ' జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బాల్ బాడ్మింటన్ పోటీలు, ఎంపికలు యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్ట్

సీతమ్మధార: పోక్సో కేసులో ఒకరిని మంగళవారం ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివీ.. సీతంపేటకు చెందిన బాలిక ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించకపోవడంతో.. ఆమె కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో ఈ నెల 20న బాలిక తల్లి ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీతంపేట హరిజన వీధికి చెందిన ఎస్.ప్రవీణ్‌కుమార్ బాలికకు తీసుకువెళ్లినట్లు గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

29న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 29న శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్, సుస్వాదీప్ ఆగ్రో సర్వీసెస్, పైనీర్ ఎలాస్టిక్, రవి రేస్, పేటీఎం సర్వీసెస్, రిలయన్స్ ట్రెండ్స్, ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 616 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఐటీఐ, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించిన 18-45 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs.gov.in/ లో పేర్లు నమోదు చేసుకోవాలి.

ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టుకు నోటిఫికేషన్

ఉక్కునగరం: ఎట్టకేలకు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టుకు నోటిఫికేషన్ జారీ అయింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు ముందు డైరెక్టర్ (ఫైనాన్స్)గా విధులు నిర్వహించిన వి.వి.వేణుగోపాలరావు ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవీ విరమణ చేశారు. అప్పటినుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కొంత కాలం ఆ పోస్టు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించగా ప్రస్తుత డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి.పాండే ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 23న దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరి తేదీగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

వారణాసి రైలుతో నెరవేరిన కల

బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

ఎంవీపీకాలనీ: విశాఖ నుంచి వారణాసికి ప్రత్యేక రైలు ప్రకటనతో 15 ఏళ్ల విశాఖవాసుల కల నెరవేరిందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. వారణాసికి విశాఖ నుంచి ప్రత్యేక రైలు కావాలని పార్లమెంట్‌లో అడిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయం తీసుకుందన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బుధ, ఆదివారాల్లో విశాఖ నుంచి, మంగళవారం, శుక్రవారాల్లో వారణాసి నుంచి ఈ ట్రైన్ అందుబాటులో ఉంటుందన్నారు. దసరా నాటికి ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. రానున్న రోజుల్లో డైలీ సర్వీసుగా ఈ ట్రైన్‌ను మార్పు చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. గ్రోత్ హబ్స్‌లో భాగంగా విశాఖ నగర అభివృద్ధిని బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశంలోని నాలుగు నగరాల్లో విశాఖ ఒకటిగా నిలిచిందన్నారు. ఈ జాబితాలో ముంబై, సూరత్, వారణాసితో పాటు విశాఖ నిలిచిందన్నారు. పీఎం గతిశక్తిలో భాగంగా పోర్టుకు 24/7 కనెక్టివిటీ, ఆక్వా ఉత్పత్తుల్లో 70 శాతం వాటా వంటి ఎన్నో ప్రాధాన్య అంశాలు విశాఖ పోర్టుకు లభించాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందన్న ఆయన కోర్టు నుంచి సముచిత నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.